# కారు మేఘాలు X

రచన :
"సుజన"

'చాలా సీరియస్ గా వుంది. సాయంత్రం అయిదు దాటితే కాని చెప్పలేనండి' అంటూ డాక్టర్ సుబ్బారావు ముందుకు నడిచాడు. రమణ అతన్ని అనుసరించాడు. 'అరగంట పోయింతరవాత మళ్ళీ ఆమందు యివ్వండి' అంటూ రమణకేసి చూచాడు డాక్టర్. రమణ మాట్లాడకుండనే తలూపి వూరుకున్నాడు. అతని ముఖంలో ప్రతిఫలిస్తున్న సంక్షోభాన్ని చదివినవాడిలా ఆలోచిస్తూ 'సరే వస్తానండి' అంటూ వెళ్ళిపోయాడు డాక్టర్.

రమణ గుమ్మం దగ్గరనుంచి యింట్లోకి నడిచాడు. ఇల్లంత భీభత్సంగా వుంది. ఎక్కడ చూచిన శనిదేవత నగ్నంగా నాట్యం చేస్తోంది. అక్కడున్న ప్రతివస్తువు యేదో సానుభూతిని తెలియపరుస్తున్నట్టుంది. సుశీల మంచంచుట్టు జనం క్రిక్కిరిసి నిలబడ్డారు. ఎవరి ముఖం చూసినా కన్నీటితో కాంతితప్పి ఆమె క్షేమాన్ని కాంక్షిస్తున్నట్టు గోచరిస్తుంది.

అన్ని ఆశలు అమ్మాయిదే పెట్టుకొని జీవిస్తున్న సుశీలతల్లి కాంతమ్మ గుండెలు బాదుకుంటుంది. ఆమె కళ్ళనుండి జారే ప్రతి కన్నీటి బిందువు మాతృప్రేమకు మారురూపంగా క్రిందికి రాలుతుంది. ఒక్కగాని ఒక్క కూతురు; యిలాంటి విషాద సంఘటనకు గురియౌతుందని కలలోకూడ తలంచలేదు.


SreeTEX SALEM FABRICS

శ్రీ టెక్స్
చేనేత బట్టలు

* మన్నికగల చేనేత బట్టలకి శ్రీ టెక్స్ *

* గ్యారంటీ రంగులు.
* రంగు ఏమాత్రమూ తగ్గదు.
* ఆకర్షణీయమైన బార్డర్లు.
* నాణ్యముగల సరకు.
* సరికొత్త డిజైనులు.
* బట్టలలో ప్రతి అంగుళమూ పరీక్షకి నిలబడును.

అతి సరసమగు ధరలు.

గృహాలంకరణములకు, డ్రాయింగ్ రూమ్‌ని ఆకర్షవంతముగా చేసేందుకు, గుమ్మాలకి, కిటికీలకు, తెరలకు, టేబుల్ క్లాత్ లకు, దిండు గలీబులకు, కారుకుషన్ కవర్లకు మొదలయిన వాటికి:—

శ్రీ టెక్స్ ఫాబ్రిక్స్‌నే వాడండి

దయచేసి జ్ఞాపకం వుంచుకోండి. శ్రీ టెక్స్, సేలం-1.

: తయారుచేసినవారు :

VISWANATHAN TEXTILES
Pension Line Road,
SALEM-I.

విశ్వనాధన్ టెక్స్‌టైల్స్
పెన్‌శన్ లైన్ రోడ్
సేలం - 1

'పాపం కన్నకడుపు యెంత శోకపెట్టిందమ్మా' అంటూ కన్నీళ్ళు తుడుచుకుంది సుశీల్ని చూడొచ్చిన సూరమ్మ.

'మరేనమ్మా నిన్న బాగానే వుంది. ఆఁ...ఎంత లోకి రావాలి? అందరం అంతే చివరికి, కాకపోతే కాస్త వెనకా ముందు.' అంటూ అందుకుంది సీతమ్మ.

'అది సరేగాని... చూశారు...' అంటూ ప్రక్కింటి భాగ్యమ్మ ఏదో గుసగుస చెప్పింది సీతమ్మ, సూరమ్మలతో. 'అట్లాగా, రమణ యేడి' అంటూ ఉత్తరంగా వున్న గదికేసి చూచారు.

రమణ నిశ్చలంగా నిలబడి కిటికీలోనించి బయటికి చూస్తున్నాడు. వాళ్ళనుకునే మాటలుగాని శోకదేవత పంచమ స్థాయిలో ఆలాపిస్తున్న విషాదాంత గీతికగాని వినిపించుకున్నట్టులేదు. ఏదో అనూహ్యమైన లోకంలో పడి గిజగిజలాడిపోతున్నాడు. శూన్యదృక్కుల్ని ఆనంతాకాశంలోకి పరచి వెర్రిగా చూస్తున్నాడు. అతనిలో ప్రతి రక్తబిందువు స్థంభించిపోయిందేమో. లేకపోతే యింత ఘోరమైన దుస్సంఘటన జరిగింతరువాతకూడ అంత నిబ్బరం అంత నిలకడ ఎక్కడ్నుంచి వచ్చింది? అతనికీ ప్రపంచంలో అంతకంటే ఆప్తులెవ్వరూ లేరే..

సుశీల పుట్టింటికి అత్తగారింటికి ఎక్కువదూరం లేని కారణంగా ఆవూరునుంచికూడ జనంవచ్చి చూచిపోతున్నారు. ప్రతిఒక్కరు ఆమె గుణాల్ని ప్రశంసిస్తూ అశ్రుతర్పణ చేస్తున్నారు. పుట్టింటిదగ్గరనుండి వచ్చే ఒక గుంపులో నల్లగా, ఎత్తుగా బలంగావున్న ఒకతను గుమ్మందాక వచ్చి ఆగిపోయాడు. అతనితోపాటు వచ్చినవారందరు సుశీలను చూస్తూన్నారు. నెమ్మదిగా లోపలకు వచ్చాడు. సుశీల మంచంవైపు అడుగువేయబోయి మళ్ళీ ఆగేడు. అటు యిటు చూచాడు. తడబడుతూ సుశీల మంచం దగ్గరకు చేరుకున్నాడు. ఆమె ముఖం చూచాడు. అతని ముఖం జేవురించింది.

ఆమె కళ్ళు పగిలిన రాజుముక్కల్లా కాంతిహీనంగా ఎక్కడో మెరుస్తున్నాయి. కన్నీరు చెంపలమీద చారలు గట్టాయి. వేడి నిట్టూర్పుల సెగలో ముఖం వాడిపోయింది. పెదాలు ఎండిపోయాయి. సుశీల నిర్జీవలగా అతనికేసి చూచింది. అతని శరీరంలోని రక్తనాడులన్ని రక్తాన్ని గుండెకు పీల్చుకున్నాయి. అతనిముఖం తెల్లబడింది. ఆమె కండ్లనుండే రెండు బిందువులు జలజల రాలాయి. ఆ రెండు బిందువులు రెండు బాకుల్లా అతని హృదయంలో దూసుకుపోయాయి. నిలబడలేకపోయాడు. సుశీల అస్పష్టంగా ఏదో గొణిగింది. రమణకోసం ఆమె కండ్లు తహతహలాడాయి. కాని ఆ పేలవపు చూపుల్లో దాగివున్న భావాన్ని అర్థం చేసుకునే వారక్కడ ఎవ్వరూ లేరు. అతను వెనక్కి తిరిగేడు. తోట్రుపడుతూనే గుమ్మందిగేడు. కోడెక్కి యింటిముఖం పట్టేడు.

అప్పటివరకు కిటికీదగ్గర నిలబడి శూన్యంలోకి వెర్రిగా చూస్తున్న రమణదృష్టి అతనిమీద పడింది. తాను చేసింది న్యాయమా అని సత్యాన్వేషణచేస్తున్న అతనిమనస్సులో ఏదో ఆశాభావం మసక మసుగ్గా మెరిసింది. అతను పోయేదారిని అనుసరించారు. అతను ఊరుప్రక్కనే వున్న చెరువుగట్టెక్కి వెనక్కి తిరిగిచూచాడు. రమణ తన్ను అనుసరిస్తున్నట్టు గమనించాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంది. చెరువు గట్టుదిగి మఱ్ఱిచెట్టు కుత్తరంగా వున్నదారినే గాలికొద్దీ పరిగెత్తేడు. రమణ కుడిప్రక్కగా పంటకాలువ ప్రక్కనవున్న రెండోదారిని వేగంగా పరుగెత్తేడు. ఈ రెండుదారులు కలిచే రావిచెట్టు దగ్గర రమణ అతనికెదురయ్యాడు. అతను నఖశిఖ పర్వతం వణికిపోయాడు.

'ఇదంతా నిజమేనా?' అన్నాడు రమణ తీవ్రంగా.

'ఏదంతా?...ఆఁ...ఏంటి?' కంపిస్తున్నగొంతుకతో ఎదురుప్రశ్న.

'ఈ కాగితం నీకెక్కడిది?'

'నాకేం తెలీదు,' దెబ్బతిన్నాడు.

'నాకు సుశీల అంతా చెప్పింది. నివు నిజంగా యీ వుత్తరం రాసిందా?' అతని కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ అడిగేడు రమణ.

'ఆ ఉత్తరం చెప్పటంలేదూ?' అన్నాడు.

'శంకరం' అంటూ రమణ రెండు చేతుల్తో మెడపట్టుకున్నాడు. కొలిమిలో కాలిన యినుప ముక్కల్లా కండ్లు ఎర్రబారాయి. ముఖం రక్తపు ముద్దయింది.

'ఊఁ, చెప్పు' అని పొలికేక వేశాడు రమణ.

శంకరం నీరైపోయాడు. చచ్చేముందు అతని చెవుల్లో




ALWAYS USE
ARUNA
BANIANS
ఎల్లప్పుడూ
* అరుణ *
బనియయన్లనే ఉపయోగించండి.
అవి:- చిరకాల మన్నికకూ - రకానికీ, అత్యుత్తమమైనది.
: వివరములకు :
అరుణాచలం నిట్టింగ్ ఫ్యాక్టరి.,
అత్యుత్తమమయిన సాదా, వల బనియన్లు, నూలు స్వెట్టర్ల, ఉత్పత్తిదారులు.
కరూరు (S.I.)

యింతవరకు తనలో గోప్యంగా వుంచుకొన్న సత్యాన్ని చెప్పివేద్దామని నిశ్చయించుకున్నాడు.

'సుశీల నాకు ఉత్తరం రాసినమాట ముమ్మాటికి నిజం. కాని సుశీల కన్నీటితో ఉత్తరంలోవున్న సంగతికి వున్నంతగా నిలబడే వాస్తవాన్ని చెప్పివుంటే అది నిజం' అన్నాడు శంకరం. రమణ పట్టువదిలేడు. శంకరం కాళ్ళమీద పడ్డాడు. 'క్షమించమ'ని కాళ్ళు పట్టుకున్నాడు. రమణ మాట్లాడలేదు. శంకరం చెప్పిన మొదటి మాటతోనే చావు బ్రతుకులమధ్య తనకోసం ఎదురుచూస్తున్న సుశీల అతని కన్నీటిలో గిర్రున తిరిగింది. హృదయంలో మెదిలింది. మనస్సులో కదిలింది.

'సుశీ' అంటు యింటిముఖం పెట్టేడు. సుశీల తనగత జీవితానికి సంబంధించిన విషాద సంఘటన్ని రమణకు నిన్న చెప్పింది. అది అతని హృదయంలో యిప్పుడు వాస్తవమని స్ఫురించింది.

* * *

సుశీలను రమణ కోరి పెండ్లి చేసుకున్నాడు. ఆమె ముఖంలో ఎప్పుడూ ఏదో పవిత్రమూర్తి ప్రస్ఫుటమౌతుంది. చామనచాయదేహం. గులాబిపూవుల్లోని మార్దవం పద్మంలోని సౌకుమార్యం ఆమెలో ప్రతిఫలిస్తాయి. ఆమె నుదిటమీద కణతలమీద ఉంగరాలు తిరిగిన జుత్తుగాలితో లీలగా ఆడుకుంటుంటే వాటిని సవరించటంకోసమే తాను సృష్టించబడ్డాననుకునేవాడు రమణ.

రమణ జీవితాన్ని వెలిగిస్తున్న ఒక దివ్యజ్యోతి సుశీల. ప్రతిరోజు సాయంత్రం మేడ మెట్లెక్కి ఏవో కబుర్లు చెప్పుకోవటం యిద్దరికీ సరదా. ఆమె సన్నిధిలో తెలియని భావవేగంలో కొట్టుకు పోయేవాడు. 'నా చిన్నతనంలోనే అమ్మ నాన్న పోయారు. మాతృప్రేమంటే యిలా వుంటుందని తెలియని ఎడారి లాంటి నా హృదయానికి తొలకరి చినుకులవలె తేనె వానలు కురిపిస్తున్నావు సుశీ' అని ఆమెకు చెప్పిందాక అతని మనస్సు ఆగేది కాదు.

ఈవిధంగా ఆరునెలలు గడిచిపోయాయి. ఒకనాటి సాయంత్రం సంధ్య కాంతిలో సుశీల స్నానంచేసి మేడెక్కి కూర్చుంది; ఏకాంతంగా. అప్పుడే రమణ బజారునుంచివచ్చి సరాసరి మేడపైకి వచ్చాడు. ఆమె సిగ్గుగా తలవంచుకుంది. కాని ఆమెముఖం ఏదో నూతన శోభతో తొణికిస లాడుతుంది. చేతిలో వున్న పూలుతీసి ఆమెతల్లో తురిమి తనవైపు త్రిప్పుకున్నాడు. ఆమెకళ్లు ఏదో సందేశాన్ని అందచేయను తహతహలాడుతున్నట్లు

గమనించి, 'ఏం సుశీ? ఇవాళ యింతయిదిగావున్నావ్?' అన్నాడు ఆమె కనుపాపల్లోకి చూస్తూ.

సుశీల సిగ్గుపడి, అధరాలు కదిలాడుతుండగా, మెలికలు తిరిగిపోతూ ఆనందంగా బాధపడుతూ 'రెండో నెల' అంది. రమణకళ్ళు ఆనందంతో మిలమిల మెరిశాయి. క్షణకాలం ఊహాప్రపంచంలో తేలిపోయాడు. తియ్యని ఆశలు రేకెత్తేయి. ఎవరో అతన్ని 'నాన్నా' అని పిలిచినట్టు తేరుకున్నాడు. 'అయితే నిజంగా నా సుశీ. మరి నాకిన్నిరోజులనుంచి చెప్పలేదేం?' అన్నాడు తానేదో సహాయపడేవాడిలా.

ఆమె నావిధంగా ప్రేమిస్తున్న రమణ తనకు భర్త కావటం ఆమె అదృష్టమనుకుంది. కాని యీ అసమాన అదృష్టం కూడ ఆమెను, ఆమె శీలాన్ని అనుమాన తెరల నులచి బయటకు తీసి జీవితాన్ని సుఖప్రదం చేయలేకపోయింది. ఆమె జీవితాన్ని ఏదో ఒక ప్రతికూలశక్తి పట్టుకొని ప్రక్కకు లాగుతుంది. ఏమి తెలియనిరోజుల్లో కనీసం లోకమంటే యిలా వుంటుందని ఊహించుకోలేనికాలంలో చేసిన పొరపాటుకు ఇప్పటివరకు నికృష్ట జీవితాన్ని గడపాల్సి వచ్చింది. దాని పరిణామం యింత క్రూరంగా వుంటుందని యెన్నడు వూహించలేదు.

జీవితంలో ఒక్కొక్కప్పుడు, అదృష్టానికి దురదృష్టానికి మనమే కారణమౌతాం. కోరిచేయకపోయినా విధి వక్రిస్తే ఎంత స్వల్పవిషయానికైనా బానిసలమై పోతాం.

* * *

అవి సుశీల హైస్కూలు చదివేరోజులు. పరిస్థితుల ప్రభావం యిలా వుంటుందని తెలుసుకోలేని పసితనమే అవాలి. ఆనాడు శంకరానికి ఉత్తరం రాసినమాట నిజమే. ఇద్దరు ఒకేక్లాసువాళ్ళు కాకపోయినా, ఒకే వూరువాళ్ళు. ఒకరోజున శంకరం సుశీలను ప్రేమిస్తున్నట్టు ఓ ఉత్తరంవ్రాసి 'ఈవిషయం ఎవరికన్నా తెలియపరిస్తే ఆత్మహత్య చేసికుం'టానని బెదిరించాడు. సుశీల లేత హృదయంలో తుఫాను రేగింది. ఈవిషయం అమ్మతో చెప్పాలనుకుంది. కాని ఆత్మహత్య చేసికుంటానన్న శంకరం మాట గొంతును గాలంలాగా పట్టి నొక్కింది. ఏవ్వరికీ చెప్పలేదు. కాని ఏదో అపరాధ బాధ కలిచివేస్తుంది. ఆ రెండోరోజు 'నా ప్రేమను అంగీకరించేవరకు అన్నం తిన్నం నీ సమాధానంకోసం ఎదురుచూస్తా'ను అని శంకరం మరొక ఉత్తరం వ్రాశాడు. సుశీల వణికిపోయింది. తన శీలాన్ని పవిత్రంగా ఉంచుకోవాలని ఎన్నో కలలుకంది. ఉత్తమ భారత స్త్రీలా జీవితాన్ని మలుపుకోవాలని ఉబలాటపడింది. కాని యిలాంటి విషమ పరిస్థితి యేర్పడుతుందని ఊహించలేకపోయింది. అయినా ఎవరికోసమో తాను 'పతిత' గావటం నీచమని భావించింది. కాని ఆనాటి సాయంత్రం పీక్కుపోయిన కళ్ళతో నిరాశల్ని నింపుకొని తూలుతున్న శంకరం ఎదురయ్యాడు. అతను అన్నం తినలేదు. అమాట తల్చుకుంటే ఆమెహృదయం మెలికలు తిరిగింది. 'అతని ఆత్మకు శాంతి కల్గించ'మని ఎవరో బాకాలు పెట్టి చెవుల్లో ఊదినట్లయ్యింది. అతని ప్రవర్తన్ని ద్వేషిస్తుంది. కాని ఒక స్త్రీ హృదయంలో అతనిమీద జాలిపడుతోంది. ఎంత దుర్మార్గుడైనా తన కోసం చనిపోవటం మహా పాపమనుకుంది.

'కాని మరి శీలం-మరి-అతని జీవితం?' అనే ప్రశ్నలు గుండెమీద సుత్తిమోత మోగించాయి. ఈ భావఘర్షణలో నలిగి, కలిగిన మనస్సులో అతని ప్రేమ నంగీకరిస్తున్నట్టు ఓ ఉత్తరం వ్రాసి అతని కివ్వబోయి ఆగింది.

శంకరం ఆమె చెయ్యిపట్టుకొని దగ్గరకు లాక్కున్నాడు. సుశీల శరీరం ఝల్లుమంది. మరుక్షణంలో శంకరం చెంప ఛెళ్లుమంది. సుశీల రివ్వున యింటికి వెళ్ళింది. శంకరం ఉత్తరం చూచాడు. కళ్ళు కంపించి ఆమెవైపు చూచి వెళ్ళిపోయాడు. సుశీలలో ఆవేదన ఎక్కువైంది. శంకరం ఆ వారం ఆమెతో మాట్లాడలేదు. ఆతరువాత తన ప్రయత్నాలను విడవనూలేదు. కామోద్రేకం వేయిపుట్లల్లో ఆదిశేషుడిలా బుసలుకొట్టింది. ఆమెనువంచించాలని అన్నివిధాల ప్రయత్నించాడు. సుశీలకాలేజీలో చేరింది. కాని శంకరం పట్టు విడువలేదు.

ఎన్నోసార్లు బ్రతిమాలాడింది - కాని లాభంలేకపోయింది. కన్నీళ్ళతో కాళ్లు పట్టుకుంది-కరుణాపూరితమైన ఒక్క కన్నీటి బిందువు అతనిలోనుండి క్రిందికి జారలేదు-పైగా బెదిరించాడు. తన కోర్కె తీరకపోతే తగిన ఫలం అనుభవిస్తావని కర్కశంగా చెప్పేశాడు. ఆమె కృంగిపోయింది.

నాలుగు సంవత్సరాలు గడిచి, చదువు సంస్కారం కలిగికూడా యింకా అతనికి ఒక స్త్రీలాగా భయపడు

తుంది. చేయని తప్పుతో కలిగిన ఆవేదనతో కృంగి పోతుంది. కారుమేఘాలు దట్టంగా పట్టేయి. వాటి మాటున అణిగిపోయిన సత్యస్వరూపం తెలిసికొనే స్థితిలో లోకంలేదు. అతను ఎంతోమందికి చెప్పేడు. గుసగుసలు ప్రారంభమైనాయి. లోకనిందతో మ్రగ్గిపోతున్న యీ సమయంలో రమణ ఆమెను కోరి పెండ్లిచేసుకున్నాడు.

* * *

పట్టుమని పదినెలలు కూడ నిండలేదు. భార్యభర్తలిరువురు ఎక్కడలేని మమకారంతో తరిస్తున్న తొలి రోజులు. కాని వారిద్దరి అనురాగ అతిశయాన్ని చూచి శంకరంకన్నులు అసూయతో గూడుకట్టాయి. సంస్కార రహితమైన అతనిలో మానవత్వం నశించింది. అవమానం ప్రేరేపించింది. ప్రతీకారం పళ్లునూరింది. రోసం మీసం తిప్పింది-ఆమె ఏమైతేనేం? రమణకు ఉత్తరం పోస్టు చేశాడు. ఆ రెండోరోజు రమణ ఉత్తరం చదివేడు, అతన్ని అంత పవిత్రంగా ప్రేమిస్తున్నట్టు కన్పించిన సుశీల వ్రాసిందేనని నిర్ధారణ చేసుకున్నాడు - శంకరం వారి జీవన మధువులో విషాన్ని చిలికేడు.

"ఎంత చదువు సంస్కారముంటే మాత్రం భార్యకు సంబంధించిన విషయంలో సాక్ష్యంతోసహా అనుమానానికి కారణమైన విషయం దొరికితే రాద్ధాంతం చేయకుండ వుండగలడా' నేటి గాలిని మూటగట్టే మగవాడు?!!

సుశీలను పిలిచి ఆ ఉత్తరం చూపిస్తూ రమణ నోటి కొచ్చినట్లు మాట్లాడేడు. నిజం చెప్పితే నమ్ముతాడనుకుంది. కాని అంత కఠినంగా మాట్లాడుతాడనుకోలేదు. అతనిలో శాంతి నశించింది. సత్యాన్ని గ్రహించే స్థితిలో లేడు. అనరాని మాటలు అన్నాడు. అసభ్యంగా తిట్టేడు. ఆమె గుండెల్లో పంజాదెబ్బ కొట్టినట్టయ్యింది. అల్లనల్లన పల్చబడే మేఘాలు మళ్ళీ కారుమేఘాలయ్యాయి.

ఆమెను వెంటాడ్తూ నాలుగేళ్ళనుండి వేదిస్తున్న శక్తి



యిక్కడకూడ ఎదురై కరాళనృత్య చేస్తుంది. ఎక్కడైతే లోకాతీతమైన ఆనందాన్ని పొందాలనుకుందో అక్కడే తానంటే ద్వేషం, అసహ్యం పెచ్చుపెరిగింది. ఎవ్వరికి తెలియకూడదో వారికే తెలిసింది. తన శీలం పవిత్రమని నిరూపించుకోగల ఆధారాలు యేవీలేవు. నిజాన్ని నివేదిస్తే క్షమిస్తాడనుకున్న భర్తే అభావంగా ప్రవర్తిస్తుంటే యింకెవ్వరికోసం తన జీవితం? అని ప్రశ్నించుకుంది.

తాను తప్పుచేయలేదనే ఆత్మసంతృప్తి ఉన్నప్పటికి తోటివాళ్ళు పదేపదే ఆవిషయాన్ని తోడితే మనస్సు బాధపడకపోదు. ఇక పొరుగువాళ్ళుకాదు. భర్తే అయితే...ఎంత సాహసానికైనా దారితీస్తుంది.

ఆరాత్రి రమణ యింటికి రాలేదు. పది కొట్టింది రాలేదు. సుశీల తన్ను యింతగా కర్కశంగా హింసిస్తున్న సంఘటల్ని గురించి ఆలోచిస్తోంది. పన్నెండు కొట్టింది రాలేదు. ఏకాంతం స్వతంత్రురాల్ని చేసింది. పెరటింటిగుండ బయటకుపోయి కోడ్డెక్కింది. అంతే. ఏమి చేసుకుందో ఏమో తెల్లవారి మంచంమీద చావు బ్రతుకులమధ్య వుంది. తెల్లవారి ఎనిమిది దాటిం తరువాత రమణ యింటికి వచ్చాడు. అప్పటికే సుశీల తల్లి కాంతమ్మవచ్చి క్రిందపడి యేడుస్తోంది. అందర్ని కన్నీరు అభిషేకించింది. రమణ యింతవరకు ఆమె మంచం దగ్గరకు పోలేదు. అనుమాన తెరల్లో చిక్కుకొని వాస్తవాన్ని చూడలేక తన్నుకులాడుతున్న సమయంలో శంకరం ఆ కారుమేఘాలు కదిలించి అనుమాన తెరల్ని చీల్చాడు. నిజాన్ని గ్రహించాడు. కాని చాల ఆలస్యమైంది. ఏమౌతుందో.

శంకరం దగ్గరనుంచి పరుగెత్తుతున్నాడు రమణ. అతని ప్రతి అడుగు సుశీల క్షేమాన్ని కాంక్షిస్తుంది. 'ఆమె బ్రతకాలి - నేను క్షమాపణ కోరాలి. నా సుశీ బ్రతకాలి' అని అంతరాత్మ ఘోషిస్తుంది. కాని యిప్పుడతను చేయగలిగేదేమీలేదు. అంతా విధి విధానంపై ఆధారపడి వుంది.

డాక్టర్ మధ్యాహ్నం చెప్పినమాటలు అతని చెవుల్లో గింగురుమంటున్నాయి—'అయిదు దాటితేగాని చెప్పలేను'— ఈమాటలే అతని జీవితానికి చీకటి వెలుగుల మధ్య గీటురాయిలా నిలబడ్డాయి.

ఆనాటి సంధ్యకాంతిలో ఆనందంగా బాధపడుతూ మెలికలు తిరిగిపోతూ 'రెండోనెల' అన్న సుశీల గొంతుక అతని హృదయాన్ని మెదిపింది.

'నాకోసం కాకపోయిన మనకు పుట్టబొయ్యే బిడ్డకోసమైనా నీవు బ్రతకాలి సుశీ' అంటూ చెరువు గట్టెక్కాడు. అప్పుడే మునిసిపాలిటీ గంట అయిదు కొట్టి తనపని ముగించుకుంది. రమణ గుండె గతుక్కుమంది. 'మరొక్కక్షణం గడిస్తే నా సుశీ బ్రతుకుతుందని డాక్టర్ చెప్పేడు. వస్తున్నా సుశీ' అంటూ శక్తికొద్ది పరుగెత్తుకొచ్చాడు.

సుశీల బరువుగా కళ్ళెత్తి మేడ మెట్లకేసి చూచింది. లోకమంత మసక మసగ్గా కనబడింది. ఇక రమణ ఆమె మంచం దగ్గరకు చేరుకున్నాడు. అతన్ని కళ్ళనిండ చూచింది. అతనేదో చెప్పను పెదేలు కదిపేడు. ఏమనుకుందో ఏమో గట్టిగా కళ్ళు మూసుకుంది. సంధ్యకాంతి మౌనంగా సాగిపోయింది; చీకటిని ఆహ్వానిస్తూ ఆమె కడసారి చూపుల్లోని కాంతిపుంజము రమణ హృదయాన్ని చీల్చుకొని కన్నీటితో కలిసి అనంతాకాశంలో అంతర్హితమైపోయింది.

'సుశీ' అంటూ ఆమెమీద వాలేడు రమణ.





మీ ఆభరణములకు అతి శ్రేష్ఠమైనది!!

== లతా వజ్రములు ==

వివరములకు, ధరల జాబితాలకు వ్రాయండి.

కె. ఎస్. రామక్రిష్ణన్ & బ్రదర్సు

76, జాఫర్‌సా వీధి (పి. బి. నెం. 455)

తిరుచిరాపళ్ళి - 8.